సాక్షి వికారాబాద్

శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



ఎన్నికల సందడి

ఎన్నికల కోడ్‌కు సమయం ఆసన్నమైంది. దీంతో అధికార పార్టీ నేతలు నియోజకవర్గాలలో సందడి చేస్తున్నారు. 8లో▸



'ఆశ'ల ఆందోళన ఉద్రిక్తం

తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఆశా వర్కర్లు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. 8లో▸



పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

వికారాబాద్‌లో పారిశుద్ధ్యం పడకేసింది. ఇంటింట చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

సంక్షేమంలో మనమే నంబర్ వన్

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



మహిళకు బతుకమ్మ చీర అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

యాలాల: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో ఉందని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం యాలాలలో బీసీ బంధు, బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని అన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో సైతం బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, చెన్నారం మాజీ సర్పంచ్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి



చన్గోముల్ పోలీస్ స్టేషన్ వద్ద కాంగ్రెస్ నాయకులు

పూడూరు: బీఆర్‌ఎస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే కాంగ్రెస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల సతీష్‌రెడ్డి అన్నారు. గురువారం మంత్రి కేటీఆర్ వికారాబాద్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ప్రశ్నించే హక్కు ఉందని, అలాంటి గొంతులను కేసీఆర్ ప్రభుత్వం నొక్కి పడుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, మండల వర్కింగ్ ప్రసిడెంట్ భాస్కర్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సైఫ్‌ఖాన్, మండల అధ్యక్షుడు మోహిన్, యువజన విభాగం జిల్లా కార్యదర్శి సుభాష్, పరిగి అసెంబ్లీ ఉపాధ్యక్షుడు నవీన్, నాయకులు రామస్వామి, రవి తదితరులను అరెస్టు చేసి చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

కొడంగల్ రూరల్: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి ఎం అడివయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పశువైద్యశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న 39 సమస్యల పరిష్కారానికి రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. తీవ్ర వైకల్యం కలిగిన దివ్యాంగులకు రూ. 25వేల ప్రత్యేక అలవెన్స్ చెల్లించాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల్లో 5శాతం కేటాయించాలని కోరారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకంలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. గృహలక్ష్మి పథకంలో పెళ్లికాని దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ కలిప్తూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు జే దశరథ్, జిల్లా కార్యదర్శి ఆర్ శంకర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సావిత్రి, నియోజకవర్గ నాయకులు మొగులప్ప, లక్ష్మీనారాయణ, మారుతి, శివకుమార్, దినేష్, శ్యామమ్మ, లక్ష్మి, ముత్యాల, భాయ్, శ్రావణ్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాది కేసీఆర్ టీమ్



ఎమ్మెల్యే ఆనంద్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరుతున్న మంత్రి కేటీఆర్



బహిరంగ సభకు హాజరైన జనం

బీఆర్‌ఎస్ ఏ పార్టీకి బీ టీం కాదు

- పోటీ వ్యక్తుల మధ్య కాదు, పార్టీలు, సిద్ధాంతాల మధ్యే..
- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అంటోంది
- 11 సార్లు అవకాశం ఇస్తే ఏం చేశారు
- దమ్ముంటే కరెంటు తీగలు పట్టుకోండి.. దరిద్రం వదుల్తది
- రేవంత్, కిషన్‌రెడ్డి రాజకీయ మరుగుజ్జులు
- వికారాబాద్ సభలో మంత్రి కేటీఆర్

వికారాబాద్: బీఆర్‌ఎస్ ఏ పార్టీకి బీ టీం కాదని, మాదంతా తెలంగాణ సాధించిన కేసీఆర్ టీమ్ అని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం వికారాబాద్‌లో ఆయన మంత్రి మహేందర్ రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, మహేష్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, యాదయ్యలతో కలిసి రూ. 173 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం బ్లాక్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలపై నిప్పులు చెరిగారు. ప్రజలు 75 ఏళ్ల కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే ఏమి చేయలేని దద్దమ్మలు.. మీరా మాకు పోటీ అన్నారు. పోటీ వ్యక్తుల మధ్య కాదు.. పార్టీలు.. సిద్ధాంతాల మధ్యే అని పేర్కొన్నారు. తెలంగాణ సాధించడమే కాదు అతి తక్కువ సమయంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆయన్ను చూసి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంక్రాంతి సమయంలో కనిపించే గంగిరెద్దులోల్లని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఇస్తామని అంటోంది.. 11 సార్లు ప్రజలు మీకు అవకాశం ఇస్తే ఏం చేశారని అని కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ లాగా కులమతాలను అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేయడం మాతో కాదన్నారు. కాంగ్రెసోళ్లకు సోయి లేదు.. ఒకాయన కరెంటు లేదంటాడు.. ఇంకొకాయన మూడె గంటలు చాలంటాడు.. వారికి వికారాబాద్ నుంచి బంపర్ ఆఫర్ ఇస్తున్నా.. దమ్ముంటే కరెంటు తీగలు పట్టుకోండి తెలుస్తది.. దరిద్రం వదుల్తది అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇదే దిక్కుమాలిన కాంగ్రెస్ హయాంలో ఎవరైనా చస్తే స్నానాలు చేయడానికి ఒక్క గంట కరెంటు ఇచ్చే వారు కాదన్నారు. ఈ రోజు 24 గంటల కరెంటుతో జనరేటర్లు, ఇన్వర్టర్లు బంద్ అయిపోయిన మాట వాస్తవం కాదా అని అన్నారు. 60 ఏళ్ల అధికారం ఇస్తే పింఛను మొత్తం రూ. 200 దాటిందా అని ప్రశ్నించారు. ఇప్పుడొచ్చి రూ. 5వేలు.. రూ. 6వేలు ఇస్తామంటే ప్రజలు నమ్ముతారా అని నిలదీశారు. కర్ణాటకలో ఈ దిక్కుమాలిన కాంగ్రెస్‌ను ఎందుకు ఎన్నుకున్నామా.. ఈ దరిద్రాన్ని ఎప్పుడు వదిలించుకుందామా అని అక్కడి ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. రేవంత్, కిషన్‌రెడ్డిలు రాజకీయ మరుగుజ్జులని, వీరా కేసీఆర్‌కు పోటీ అని ఆయన ఎద్దేవా చేశారు. బీజేపీ 25 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది.. ఏ రాష్ట్రమైనా తెలంగాణతో పోటీ పడుతుందా అని నిలదీశారు. ఏ సీఎం అయినా.. ఏ పీఎం అయినా కేసీఆర్‌కు సాటి రారని అన్నారు. పథకాల అమలు, తలసరి ఆదాయంలో తెలంగాణే టాప్ అన్నారు. ప్రజలు ఆలోచించండి.. ఆగం కావద్దు.. అభివృద్ధి చేసిన పార్టీనే గెలిపించాలని మంత్రి కేటీఆర్ కోరారు. కాంగ్రెస్, బీజేపీ ఇచ్చే పైసలు తీసుకొని బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని కోరారు.

సొంత ఆశలు లేని వ్యక్తి ఆనంద్

వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్‌కు సొంత ఆశలు, ఆశయాలు లేవని, నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యమని మంత్రి కేటీఆర్ అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ఆయన్ను కాకుండా ఇంకెవర్ని గెలిపిస్తారని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల కోసం యుద్ధాలు చేసే పరిస్థితి నుంచి మెడికల్, ఆయుష్ కళాశాలలు ఏర్పాటు చేసుకున్న స్థాయికి వికారాబాద్ వచ్చిందన్నారు. మర్పల్లిలో రోడ్డు నిర్మాణానికి రూ. 12 కోట్లు మంజూరు చేస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. ఆనంద్ కోరిక మేరకు అనంతగిరిని టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. వికారాబాద్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డు పనులను చేపడతామని హామీ ఇచ్చారు.

ప్రజలు బీఆర్‌ఎస్ పక్షమే

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధమైపోయారని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. రూ. 173 కోట్లతో వికారాబాద్‌ను అభివృద్ధి చేయడం సంతోషంగా ఉందన్నారు. కొత్త జిల్లాలు, మండలాలు, తండాలను పంచాయతీలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ హామీలను ఎవరూ నమ్మరన్నారు.

తెలంగాణ దేశానికే ఆదర్శం

అభివృద్ధి, సంక్షేమంలో నేడు తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మన పథకాలను ప్రధాని మోదీ కాపీ కొడుతున్నారని ఆరోపించారు. జిల్లాను జోగులాంబ జోన్ నుంచి చార్మినార్ జోన్‌కు మార్చడం అదృష్టమన్నారు. దీంతో ఎంతో మంది నిరుద్యోగ యువతకు లబ్ధి చేకూరుతుందన్నారు.

దీవించండి

నేను మీ బిడ్డను.. ఏ కష్టమొచ్చినా అండగా ఉంటా.. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కోరారు. ఓ కాంగ్రెస్ పెద్ద మనిషి నాపై అనవసర విమర్శలు చేస్తున్నారు. ఆయన చేసిన అవినీతి అందరికీ తెలుసని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు.



యూత్ కాంగ్రెస్ నాయకులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నాయకుల ముందస్తు అరెస్టు

వికారాబాద్ అర్బన్: మంత్రి కేటీఆర్ వికారాబాద్ పర్యటన ప్రశాంతంగా సాగింది. గత ఏడాది వికారాబాద్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ వచ్చిన సందర్భంలో వివిధ పార్టీల నాయకులు సీఎం కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కేటీఆర్ పర్యటించే అన్ని మార్గాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. డీఎస్సీ అభ్యర్థులు, బీజేపీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదితరులను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు కేటీఆర్‌ను అడ్డుకునేందుకు పన్నిన పన్నాగాన్ని పోలీసులు విఫలం చేశారు. ఎన్నెపల్లి సమీపంలో ఉన్న యూత్ కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు యూత్ కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. కేటీఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు.

ఒకేచోట 15 శిలాఫలకాలు

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు సమయం ఎక్కువగా లేక పోవడంతో ఒకే చోట ఏర్పాటు చేసిన 15 శిలాఫలకాలకు మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ప్రారంభోత్సవాలు చేశారు.

పథకాల అమలులో ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి
- గ్రామాల్లో సుడిగాలి పర్యటన
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

బొంరాస్‌పేట: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఆదర్శ పాలన అమలవుతోందని తెలిపారు. అభివృద్ధిలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. చౌదర్‌పల్లిలో రూ.15లక్షలతో నిర్మించిన ముదిరాజ్ భవనాన్ని ప్రారంభించారు. మన ఊరు మనబడి కింద రూ.27లక్షలతో నిర్మించిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రహరీని, మూత్రశాలలు, మైనార్టీ ప్రహరీని ప్రారంభించారు. పల్లె దవాఖానాను ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు, క్రీడాకారులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. హంసాన్‌పల్లి నుంచి నాన్‌చెర్వు తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. బుర్రి తండా, బాపల్లి, మెట్లకుంట తండా, బురాన్‌పూర్ తదితర గ్రామాలు వివిధ అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరుణాదేశు చౌహాన్, ఎంపీపీ హేమీబాయి, మాజీ వైస్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, సర్పంచులు వెంకటమ్మ, అంబేడ్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు బరిలో బీఎంఆర్?



డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డితో భేటీ అయిన మనోహర్‌రెడ్డి

- కాంగ్రెస్ టికెట్ దాదాపు ఖరారు
- ఇప్పటికే బీఆర్‌ఎస్ సభ్యత్వానికి రాజీనామా
- త్వరలో డీసీసీబీ చైర్మన్ పదవికీ..
- వ్యూహాత్మకంగా కాంగ్రెస్ గూటికి
- బీఆర్‌ఎస్‌కు భారీ షాక్

వికారాబాద్: కొంత కాలంగా బీఆర్‌ఎస్‌లో అంటీ ముట్టనట్టు ఉంటూ వచ్చిన డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ఎట్టకేలకు అధికార పార్టీకి రాజీనామా చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. గురువారం ఉదయం ఆయన డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డిని సైతం మర్యాదపూర్వకంగా కలిశారు. కొంత కాలంగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వచ్చిన ఆయన తాండూరు నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. త్వరలో డీసీసీబీ చైర్మన్ పదవికి కూడా రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. 10 రోజుల క్రితమే తన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి మెడలో కాంగ్రెస్ కండువా వేయించిన ఆయన తాండూరుపై పట్టు సాధించేందుకు వ్యూహాలకు పదును పెడుతూ వస్తున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అండదండలతోనే ఆయనకు తాండూరు టికెట్ దాదాపు ఖరారయ్యిందనే ప్రచారం సాగుతోంది. అయితే ఎన్నికల సమయంలో మనోహర్‌రెడ్డి పార్టీ వీడటం బీఆర్‌ఎస్‌కు భారీ దెబ్బ తగిలిందనే చెప్పాలి.

తాండూరు బరిలో..

త్వరలో జరగనున్న ఎన్నికల్లో తాండూరు అసెంబ్లీ నుంచి మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలవటం ఖాయమని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున తాండూరు నుంచి పోటీ చేసేందుకు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, రఘువీరారెడ్డి, రమేశ్ మహరాజ్,ధారాసింగ్ తదితరులు పోటీ పడుతూ వచ్చారు. తమకు తాండూరు టికెట్ కేటాయించాలని పార్టీ అధిష్టానానికి దరఖాస్తు కూడా చేసుకున్నారు. ఇటీవలి వరకు తాండూరు టికెట్ విషయంలో కేఎల్ఆర్ – రఘువీరారెడ్డి మధ్య పోటీ ఉందని అందరూ భావించగా.. అనూహ్యంగా మనోహర్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఆయన పార్టీలో చేరక ముందే పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బీఎంఆర్ పేరు జాబితాలో పెట్టినట్టు తెలుస్తోంది. తాండూరు టికెట్ దాదాపు ఖరారు కావటంతోనే బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి హస్తం గూటికి చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. శుక్రవారం మనోహర్‌రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దల సమక్షంలో పార్టీలో చేరనున్నారు.

పలు సానుకూలతలు

బీఎంఆర్ తాండూరు వాస్తవ్యుడు కానప్పటికీ అక్కడి ప్రజలు, నేతలో సంబంధాలు బాగానే ఉన్నాయి. వ్యాపారి అయిన అతని సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి రెండు దశాబ్దాలుగా తాండూరులోనే నివాసం ఉంటున్నారు. మనోహర్‌రెడ్డి సైతం పది సంవత్సరాలకు పైగా తాండూరులో ఉంటూ వ్యాపారాలు నెరిపా డు.అక్కడి నేతలు, ప్రజలతో సంబంధాలు బాగానే ఉన్నాయి. ఇవి ఆయనకు సానుకూలంగా మారనున్నాయి. అయితే అక్కడి నేతలు ఇప్పటి వరకు కేఎల్ఆర్ బరిలో ఉంటాడని భావిస్తూ ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు ఇస్తూ వచ్చారు. ఇప్పుడు తాండూరు కాంగ్రెస్ నేతలందరినీ ఒక్కతాటిపైకి తీసుకురావటం మాత్రం సవాలుగా మారనుంది.

నేడు కాంగ్రెస్ గూటికి కసిరెడ్డి

- ఖర్గే, రాహుల్ సమక్షంలో పార్టీలో చేరికకు నిర్ణయం
- 50 మంది నాయకులతో కలిసి ఢిల్లీ వెళ్లేందుకు ఏర్పాట్లు



ఆమనగల్లు: బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ సమక్షంలో హస్తం కండువా కప్పుకోనున్నారు. నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కసిరెడ్డితో కలిసి పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. బీఆర్‌ఎస్ నుంచి కల్వకుర్తి అసెంబ్లీ టికెట్ ఆశించిన నారాయణరెడ్డి కొద్ది రోజులుగా అధిష్టానం తీరుపై అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలు, అభిమానుల ఒత్తిడి మేరకు ఇటీవల పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిలతో భేటీ అయ్యారు. టికెట్ విషయంలో స్పష్టత వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరేందుకు డిసైడయ్యారు. సుమారు 50 మంది నాయకులతో కలిసి ఢిల్లీ వెళ్లనున్నారు.

గొర్రెల పంపిణీలో నీలినీడలు

- నత్తనడకన రెండో విడత
- మంజూరు చేయాల్సిన యూనిట్లు 11,583
- విడుదల కాని ప్రభుత్వ వాటా
- లబ్ధిదారుల వాటా నుంచే పథకం అమలు
- ఇప్పటి వరకు పంపిణీ చేసిన యూనిట్లు 603
- ఆందోళనలో అర్హులు



వికారాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం జిల్లాలో నత్తనడకన సాగుతోంది. ఇవ్వాల్సింది కొండంత.. ఇచ్చింది గోరంత అన్నట్లు తయారయ్యింది రెండో విడత గొర్రెల పంపిణీ పథకం. ఈ పథకానికి ఇప్పుడు కొత్త సమస్య ఎదురవుతోంది. రెండో విడత కార్యక్రమం ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా నేటికీ 5శాతం లక్ష్యానికి కూడా చేరుకోలేదు. ఇప్పటి వరకు జీవాలు దొరకడం లేదని కుంటిసాకులు చెబుతూ వచ్చిన అధికారులు ఇప్పుడు కొత్త పల్లవి అందుకున్నారు. ప్రభుత్వం ఏ మేరకు నిధులు మంజూరు చేస్తే ఆ మేరకు పంపిణీ చేస్తున్నామని చెబుతున్నారు. జిల్లాలో మొదటి విడతలో 10,477 యూనిట్ల పంపిణీ చేశారు. రెండో విడతలో 11,583 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే గడిచిన నాలుగు నెలల్లో కేవలం 603 యూనిట్లు మాత్రమే పంపిణీ చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్లే పథకం నత్తనడకన సాగుతోందనేది స్పష్టమవుతోంది. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం జిల్లాకు రావాల్సిన బడ్జెట్ ఇంకా విడుదల కాలేదు. అయితే గొల్లకురుమలు తమ వాటా కింద చెల్లించిన నిధులతోనే ఈ పథకం కొనసాగిస్తున్నారు.

రెండో విడత లక్ష్యం 11,583 యూనిట్లు

జిల్లాలో 311 గొర్రె కాపరుల సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 22,025 మంది సభ్యులు ఉన్నారు. 2017 – 18 సంవత్సరంలో గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారు. 2018 జూన్ చివరి నాటికి 10,078 యూనిట్ల పంపిణీ చేశారు. మొదటి విడతలో మిగిలిపోయిన యూనిట్లతోపాటు కొత్తగా ఏర్పడిన మండలాలైన దుద్యాల, హకింపేట్, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఐదు గ్రామాలు కలుపుకొని రెండో విడతలో 11,583 యూనిట్లు అంటే 2,43,243 గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉంది. ఒక్కో యూనిట్‌కు ప్రభుత్వం 75శాతం సబ్సిడీ ఇస్తోంది. గతంలో యూనిట్ విలువ రూ. 1.25 లక్షలు కాగా, ప్రస్తుతం ఈ మొత్తాన్ని రూ. 1.75 లక్షలకు పెంచారు. ఇందులో లబ్ధిదారు వాటా రూ. 43,750 పోను మిగతా సొమ్మును ప్రభుత్వం చెల్లిస్తుంది. అంటే ప్రభుత్వ వాటా రూ.1,31,250. ఏదైనా కారణం చేత గొర్రె చనిపోతే పరిహారం ఇవ్వడానికి గాను ప్రతి గొర్రెకు కొనుగోలు సమయంలోనే ప్రభుత్వమే బీమా చేయిస్తుంది. ప్రీమియం డబ్బులు సైతం యూనిట్ విలువలోనే జత చేయడంతో ప్రత్యేకంగా బీమాకు చెల్లించాల్సి అవసరం లేదు. ఒక్కో యూనిట్‌లో 20 ఆడ గొర్రెలు, ఒక పొట్టేలును పంపిణీ చేస్తారు. ఇందులో రూ. 10 వేలు పొట్టేలుకు ఒక్కో ఆడ గొర్రెకు రూ. 7,400 ఖర్చు చేయనున్నారు.

లబ్ధిదారుల వాటా నుంచే..

రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలో ప్రభుత్వం తెలివిగా వ్యవహరిస్తోంది. నిధుల లేమి కనిపించకుండా జాగ్రత్త పడుతూ పథకాన్ని ముందుకు తీసుకెళుతోంది. ఇప్పటి వరకు గొల్ల కురుమలు తమ వాటాగా చెల్లించిన డబ్బులు కూడా ఈ పథకానికి పూర్తి స్థాయిలో ఖర్చు చేయటం లేదు. డీడీలు చెల్లించి ఆరు నెలలు కావస్తున్నా గొర్రెలు పంపిణీ చేయటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. రెండో విడతలో భాగంగా 8వేల మంది గొల్ల కురుమలు తమ వాటా ధనం (ఒక్కొక్కరు రూ. 43750 చొప్పున) రూ. 35 కోట్లు చెల్లించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 603 యూనిట్లు పంపిణీ చేశారు. ఇందు కోసం రూ. 7.91 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే లబ్ధిదారులు చెల్లించిన వాటా(రూ.35కోట్లు)లో 20 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేశారు. గొర్రెల పంపిణీ పథకానికి రూ. 202.27 కోట్లు అవసరం. ఇందులో ప్రభుత్వం రూ. 152.2 కోట్లు చెల్లించాల్సి ఉంది. మిగిలిన రూ. 50.67 కోట్లు గొల్ల కుర్మలు భరించాలి. అయితే ప్రభుత్వ వాటా ఇప్పటి వరకు విడుదల కాలేదు. లబ్ధిదారుల వాటాలోనే కొంత మొత్తాన్ని ఖర్చు చేసి పథకాన్ని అమలు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి, ఎమ్మెల్యే పర్యటన

తాండూరు రూరల్: తాండూరు మండలంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు శుక్రవారం వివిధ గ్రామాల్లో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, భూగర్భ జల వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిలు హాజరు కానున్నారు. జినుగుర్తి శివారులో మైనార్టీ గురుకుల హాస్టల్ భవనం ప్రారంభం, చంద్రవంచ చెక్‌డ్యాం, బెల్కటూర్ బ్రిడ్జి, బొంకూర్–బిజ్వార్ బ్రిడ్జి నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారని సంబంధిత అధికారులు తెలిపారు.

ఎస్పీ కోటిరెడ్డిని కలిసిన ఏఎస్పీ



అనంతగిరి: వికారాబాద్ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రవీందర్ రెడ్డి గురువారం జిల్లా ఎస్పీ కోటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన ఇదివరకు సీఐడీలో అదనపు ఎస్పీగా పనిచేసి వికారాబాద్‌కు బదిలీపై వచ్చారు.

ఆటో, ట్యాంకర్ ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ ఆటోను ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం ధారూర్ నుంచి అదే మండలానికి చెందిన విమలమ్మ, విజయలక్ష్మి, లావణ్య, చంద్రయ్య, శోభన, చిన్నిబాయి తదితరులు ఆటోలో వికారాబాద్ వస్తున్నారు. ఈ క్రమంలో బుగ్గ ఆలయ సమీపంలో చేరుకోగానే తాండూర్ వైపు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ ఒక్కసారిగా ఢీ కొట్టింది. స్థానికులు వెంటనే ఆటోను లేపి అందులో ఇరుక్కున్న ప్రయాణీకులను బయటకు తీశారు. గాయాలైన వారిని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో విమలమ్మ, విజయలక్ష్మిలకు తీవ్ర గాయాలు కాగా వారికి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

నేపాల్ బాలిక అదృశ్యం

పహాడీషరీఫ్: నేపాల్ బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన బిక్రం సప్‌కోట భార్య పిల్లలతో ఐదేళ్ల క్రితం తుక్కుగూడకు వలస వచ్చి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. ఈ నెల 4వ తేదీనా రాత్రి 10.45 గంటల సమయంలో అతని పెద్ద కుమార్తె సజినా సప్‌కోట (17) ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లింది. ఆమె ఎంతకి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

ఆశ వర్కర్ల డిమాండ్లను పరిష్కరించండి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో నిరసన కార్యక్రమంలో భాగంగా మంత్రికి వినతిపత్రం ఇచ్చేందుకు మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయం వద్దకు వెళ్తున్న క్రమంలో ఆశావర్కర్ కవిత స్పృహ కోల్పోగా చికిత్స నిమిత్తం ఆమెను ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నర్సింహారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం సిర్లాహిల్స్‌లోని కవిత నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆశ వర్కర్ల విషయంలో వెంటనే విద్యాశాఖ మంత్రి స్పందించి వారి డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాన్నారు.

ఎన్నికల.. సందడి



తాండూరు బహిరంగ సభకు హాజరైన జనం(ఫైల్)

- అధికార పార్టీ నేతల వరుస పర్యటనలు
- అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- వారం రోజుల వ్యవధిలో కేటీఆర్, హరీశ్‌రావుల సభలు
- జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల కోడ్ కూసేందుకు సమయం ఆసన్నమైంది. దీంతో అధికార పార్టీ నేతలు నియోజకవర్గాలలో సందడి చేస్తున్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలలో సిట్టింగ్‌లకే మరోసారి అవకాశం ఇచ్చారు. దీంతో అధికార బీఆర్‌ఎస్‌లో ఎన్నికల సందడి కనిపిస్తోంది. ఎన్నికల కోడ్ వచ్చేలోపు నియోజవర్గాల్లో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా వారం రోజుల వ్యవధిలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు జిల్లాల్లో పర్యటించి భారీ బహిరంగ సభలు నిర్వహించారు. మరోవైపు జిల్లా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో బిజీగా ఉన్నారు. వికారాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్ నాలుగు అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించేందుకు పావులు కదుపుతున్నారు. జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు సిట్టింగ్ ఎమ్మెల్యేలకే సీఎం కేసీఆర్ మరోసారి అవకాశం కల్పించారు. దీంతో ఎన్నికల కోడ్ వెలువడక ముందే సగం నియోజవర్గాలలో ఎన్నికల ప్రచారం సగం వరకు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారని తెలుస్తోంది. దీంతో వారం రోజుల వ్యవధిలోనే మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు జిల్లాలో పర్యటించి భారీ బహిరంగ సభలు నిర్వహించారు. మంత్రి హరీశ్‌రావు తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించారు. మంత్రి కేటీఆర్ వికారాబాద్‌లో పర్యటించి బహిరంగ సభకు హాజరయ్యారు. పరిగి నియోజకవర్గంలో బహిరంగ సభ నిర్వహించాల్సి ఉంది. కాని ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి తండ్రి మాజీ డిప్యూటీ స్పీకర్ హరీశ్వర్‌రెడ్డి మరణించడంతో సభ వాయిదా పడింది. మరోవైపు గనులు, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి నెల రోజులుగా జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలంటూ ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ రాకముందే బీఆర్‌ఎస్ ప్రజల మద్దతు కూడకట్టుకొంటుంది.

ప్రగతి పనులకు కార్యరూపం..

తాండూరుతో పాటు మిగతా నియోజవకర్గాలలో 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మంత్రిగా ఉన్న మహేందర్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. 5 ఏళ్ల తర్వాత కొన్ని పనులు పూర్తి అయ్యాయి. దీంతో ఇటీవల మంత్రి పదవి దక్కడంతో నాడు శంకుస్థాపన చేసిన పనులకు మహేందర్‌రెడ్డి ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. మరోవైపు కొత్తగా మంజూరైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ రాకముందే మంజూరైన అభివృద్ధి పనుల కార్యరూపం దాల్చేలా పనులు సాగిస్తున్నారు.

బహుజనులంతా బీఎస్పీని బలపరచండి



రాజేంద్రప్రసాద్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న దొరశెట్టి సత్యమూర్తి

తాండూరు అసెంబ్లీ ఇన్‌చార్జి దొరశెట్టి సత్యమూర్తి

తాండూరు టౌన్: బహుజనులకు రాజ్యాధికారం రావాలంటే బహుజన సమాజ్ పార్టీని బలపరచాలని తాండూరు అసెంబ్లీ ఇన్‌చార్జి దొరశెట్టి సత్యమూర్తి అన్నారు. గురువారం బషీరాబాద్ మండలం ఇందర్‌చేడ్ గ్రామానికి చెందిన గండ్ల రాజేంద్ర ప్రసాద్‌తో పాటు పలువురు బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సత్యమూర్తి మాట్లాడుతూ బీఎస్పీ నుంచి తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్‌ను బరిలోకి దింపనున్నట్లు పార్టీ అధినాయకులు నిర్ణయించారన్నారు. బహుజనులంతా ఏకమైతేనే రాజ్యాధికారం దక్కుతుందన్నారు. లేని ఎడల అగ్రవర్ణాల చేతిలో అణిగి పోవాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, పెద్దేముల్ మండల అధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె విరమణ

తాండూరు రూరల్: తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మె విరమించారు. గురువారం సీడీపీఓ కార్యాలయం వద్ద సూపర్‌వైజర్‌కు సమ్మె విరమిస్తున్నట్లు రాతపూర్వకంగా రాసి అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లుకు ప్రభుత్వం 5 శాతం ఐఆర్ అందజేస్తోందన్నారు. టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష మేర ఉద్యోగ విరమణ ప్రోత్సహకాలు అందించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు అంగన్‌వాడీ జేఏసీ నాయకులు తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్పలకు అంగన్‌వాడీలు కృతజ్ఞతలు తెలిపారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కుల అసమానత నిర్మూలన పోరాట సమితి సభ్యులు

తాండూరు టౌన్: నారాయణ పేట్ జిల్లా మరికల్ మండలం చిత్తనూరు గ్రామం వద్ద ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఈ నెల 8వ తేదీన కుల అసమానత నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సమితి జిల్లా కన్వీనర్ వెంకటయ్య కోరారు. ఈ సందర్భంగా గురువారం ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను తాండూరులో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆసియాలోనే అతి పెద్ద ఇథనాల్ కంపెనీని ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఏర్పాటుచేశారని, దీనివల్ల భూమి, జలం కాలుష్యం అవుతుందన్నారు. జంతువులు మృతి చెందుతున్నాయని, ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. 8న చేపట్టబోయే ధర్నాకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని వారు కోరారు.

మూడోసారి సీఎం కావడం ఖాయం

- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- దేశంలోనే ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాల అమలు
- బీసీ బంధు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అఖండ విజయం సాధిస్తుందని, కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు. గురువారం తాండూరు పట్టణంలోని తులసీగార్డెన్‌లో బీసీ బంధు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీతో పాటు కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సమావేశానికి తాండూరు పట్టణంతో పాటు తాండూరు మండలం, కోట్‌పల్లి మండలాలకు చెందిన బీసీ బంధు పథకం లబ్ధిదారులకు రూ.1లక్ష చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం తథ్యమని, సీఎం కేసీఆర్‌కు మూడోసారి బ్రహ్మరథం పట్టడం ఖాయమన్నారు. హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక తాండూరు నియోజకవర్గాన్ని ఎన్నడు లేని విధంగా అభివృద్ధి పథంలో తీసుకెళ్లినట్లు చెప్పారు. దేశంలోనే తాండూరు ప్రాంతాన్ని ఆదర్శవంతంగా నిలబెడతానన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తోందన్నారు. ఇప్పటికే ఎస్సీ వర్గాలకు దళితబంధు పథకం ద్వారా రూ.10 లక్షల అందించారన్నారు. బీసీ వర్గాల ఆర్థిక ఎదుగుదలకు సీఎం కేసీఆర్ బీసీ బంధు అమలు చేశారన్నారు. అందులో భాగంగా మొదటి విడతలో ఒక్కో లబ్ధిదారుడికి రూ.1లక్ష చొప్పున తాండూరు నియోజకవర్గంలో 200 మందికి రూ.2కోట్ల చెక్కులను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీపనర్సింహులు, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వీణాశ్రీనివాసచారి, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నయిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి వ్యవసాయం.. ప్రవృత్తి నటన

వివిధ సినిమాల్లో సైడ్ విలన్ పాత్రల్లో సాయిలు



జయదేవ్ సినిమాలోని సన్నివేశంలో అంగడిరాయిచూర్ సాయిలు

కొడంగల్ రూరల్: వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తూ అవకాశం దొరికినప్పుడల్లా సినిమాల్లో నటిస్తూ సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న నటుడిని పలువురు గ్రామస్తులు అభినందిస్తున్నారు. మండల పరిధిలోని అంగడిరాయిచూర్ గ్రామానికి చెందిన కె.సాయిలు దాదాపు 5ఏళ్లుగా టీవీ సీరియల్స్, వివిధ సినిమాల్లో సైడ్ విలన్‌గా నటిస్తూ ప్రధాన పాత్రల కోసం ఎదురుచూస్తున్నాడు. మర్యాద రామన్న, సెల్యూట్, యమదొంగలు, ఉంగరాల రాంబాబు, ఆక్సిజన్ సినిమాలలో సైడ్ విలన్ క్యారెక్టర్ పాత్ర పోషించారు. ఆడదే ఆధారం, స్వాతి చినుకులు, మూగ మనసులు తదితర టీవీ సీరియల్స్‌లలో విలన్ పాత్రలు, బాహుబలి–2లో సైనికుడి పాత్రలో నటించారు. తెలంగాణ దేవుడు, మూడేళ్ల క్రితం హర్పల్ పాగల్‌పన్ హిందీ సినిమాలో సైతం నటిస్తూ తనదైన శైలితో ప్రేక్షకులను మెప్పించాడు. ఇటీవల రాంగోపాల్‌వర్మ డైరెక్షన్‌లో ముగ్గురు వెధవలు సినిమాలో ఎస్‌ఐ పాత్ర పోషించారు. త్వరలోనే విడుదలకు సిద్ధమవుతున్న ముగ్గురు వెధవలు సినిమా సక్సెస్ కావాలని ఎస్‌ఐ పాత్ర పోషించిన నటుడు సాయిలు కోరుకుంటున్నాడు. కొడంగల్ ప్రాంతానికి చెందిన చిట్లపల్లి, అన్నారం, హస్నాబాద్ తదితర గ్రామాలకు చెందిన పలువురు సినిమా రంగంలో రాణిస్తున్నారని, ప్రస్తుతం విడుదలకు సిద్ధమవుతున్న ముగ్గురు వెధవలు సినిమాలో ఎస్‌ఐగా నటించానని, సినిమా సక్సెస్ కావాలని, మంచి అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు సాయిలు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా 11కేవీ అష్టలక్ష్మి ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

30 పడకల ఆసుపత్రి మంజూరు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీకి 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ని మంజూరు చేస్తూ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్య తెలంగాణలో భాగంగా పేదల చెంతకు వైద్యం అందించడమే లక్ష్యంగా ఇటీవలే కందుకూర్‌లో మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారు. మహేశ్వరం సీహెచ్‌సీని 30 నుంచి 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేశారు. తాజాగా జల్‌పల్లి మున్సిపాలిటీకి ఆసుపత్రి మంజూరు చేయడంతో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

తలకొండపల్లి: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ప్రాంతంలో, రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిరుపేదలకు సర్వే నెంబర్ 6, 7లో ఇండ్ల స్థలాలు కేటాయించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి శానమోని పాండుప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూర్ చేయాలని ఆయన కోరారు.

తులం బంగారు గుండ్లు అపహరణ

శంకర్‌పల్లి: వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గుండ్లను అపహరించిన సంఘటన శంకర్‌పల్లి ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం ఇబ్రహింపల్లి గ్రామానికి చెందిన అనసూయ(65) శంకర్‌పల్లికి పని నిమిత్తం వచ్చింది. తిరిగి వెళ్లే క్రమంలో ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా అనసూయ మెడలోని తులం గుండ్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ నాగరాజు తెలిపారు.

మాజీ పోలీస్ ఉద్యోగి మృతి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో మాజీ పోలీస్ ఉద్యోగి మృతి ప్రభాకర్‌రెడ్డి (76) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. మృతుడు రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ప్రభాకర్‌రెడ్డి మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఈయనకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆశల ఆందోళన ఉద్రిక్తం

- మంత్రి కేటీఆర్ సభలో గందరగోళం
- గంటపాటు రోడ్డుపై రాస్తారోకో, మానవహారం
- ఆశలకు పోలీసులకు మధ్య తోపులాట
- సొమ్మసిల్లి పడిపోయిన కార్యకర్త



మంత్రి కేటీఆర్ సభలో ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు

షాద్‌నగర్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఆశా వర్కర్లు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. గురువారం పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి కేటీఆర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతున్నారు. అదే సమయంలో సభా ప్రాంగణానికి చేరుకున్న ఆశ వర్కర్లు ఆందోళనకు దిగారు. 'ప్రభుత్వం స్పందించాలి, మా సమస్యలు తీర్చాలి అంటూ నినాదాలు చేశారు' మంత్రి కేటీఆర్‌ను కలిసి సమస్యలను చెప్పుకునేందుకు ఆశ వర్కర్లు చేసిన ప్రయత్నం ఫలించలేదు. సభ అనంతరం ఆశ వర్కర్లు రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో, మానవహారం చేసి మరింత ఉధృతం చేశారు. ఆశ వర్కర్లు గంటపాటు రోడ్డుపై బైఠాయించారు. వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ కష్టాలు ఎదురయ్యాయి. విషయాన్ని తెలుసుకున్న సీఐ ప్రతాప్‌లింగం, ఎస్‌ఐ దేవకి మహిళా సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆశ వర్కర్లను చెదరగొట్టే క్రమంలో పోలీసులకు ఆశ వర్కర్లకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ తోపులాటలో ఆశ వర్కర్ లక్ష్మి సొమ్మసిల్లి పడిపోయారు. ఈ సందర్భంగా ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి లలిత మాట్లాడుతూ మా సమస్యలను మంత్రి కేటీఆర్‌కు చెప్పుకునేందుకు శాంతియుతంగా వస్తే పోలీసులు అడ్డుకున్నారన్నారు. కనీసం మంత్రి మమ్మల్ని పట్టించుకోకుండా వెళ్లిపోయారని ఆరోపించారు. సమస్యల పరిష్కారంకోసం ఆందోళన చేస్తుంటే పోలీసులు కఠినంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేని యెడల సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పావని, అంజమ్మ, జయమ్మ, యాదమ్మ, షకీలాభేగం, రజిత, పుష్ప, శ్రీదేవి, ఇంద్ర, మంజుల, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవంలో మంత్రి మహేందర్‌రెడ్డి

షాద్‌నగర్: పేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, గిరిజన భవన నిర్మాణానికి శంకుస్థాపనకు మంత్రులు కేటీఆర్, పట్నం మహేందర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. తద్వార అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే నెంబర్ 1 స్థానంలో ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అఖండ విజయం సాధించడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణలో ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కు తప్పా మరే పార్టీకి లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, జిల్లా రైతు సమన్వయ కమిటీ చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఇందిర, భీష్వ కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



పారిజాతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

మహేశ్వరం: వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపైన కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన యువకులు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏర్పుల శ్రీశైలం ఆధ్వర్యంలో పారిజాత నర్సింహారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక కాంగ్రెస్‌లో స్వచ్ఛందంగా పలువురు చేరుతున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు ఒక్కటే అన్నారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అల్వాల్ మహేశ్ గౌడ్, భాస్కర్, రఘు, భాస్కర్ గౌడ్, సోమేష్ గౌడ్ పలువురు పాల్గొన్నారు. ఫొటో ఫ్రేమ్‌ను చిగురింత దంపతులకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ నగరపంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, గణేశ్, రామయ్య, శేఖర్, విఠల్, మహిపాల్, యాదయ్య పలువురు పాల్గొన్నారు.



సభకు హాజరైన మహిళలు

కేటీఆర్‌కు ఘన స్వాగతం

అనంతగిరి: వికారాబాద్ పర్యటనకు వచ్చిన కేటీఆర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో హెలిప్యాడ్ దిగి నేరుగా సభాస్థలికి చేరుకుని సభలో పాల్గొన్నారు. హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ తదితరులు ఘన స్వాగతం పలికారు. మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌తో పాటు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, తాండూర్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రావు, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, లైబ్రరీ చైర్మన్ రాజుగౌడ్, సీనియర్ నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, అవినాష్‌రెడ్డి, వడ్ల నందు, కృష్ణ, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు, ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సభకు వస్తున్న జనం